లక్ష్యం రూ.54.18 కోట్లు

- కల్లూరు మండలంలో మొత్తం 1587 సంఘాలు
- ప్రస్తుతం 325 గ్రూపులకు రూ.27.60 కోట్ల రుణాలు పంపిణీ
- ఆర్థికంగా ఎదుగుతున్న మహిళలు



కల్లూరులో బ్యాంక్ లింకేజ్ ద్వారా ఏర్పాటు చేసిన కిరాణ అండ్ జనరల్ స్టోర్

కల్లూరు: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తున్నది. బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలను అందజేస్తుండడంతో డైరీ ఫామ్‌లు, పాడి గేదెల పెంపకం, పిండి మిల్లులు, కారం మిల్లులు, కిరాణా షాపుల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. పేదరికంలో ఉన్న కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటూ వారి జీవనోపాధి పెంపొందించడానికి బ్యాంక్ లింకేజ్ రుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

సీనియార్టీ ఆధారంగానే..

ప్రభుత్వం 1998 నుంచి బ్యాంక్ లింకేజ్ రుణాలను మహిళలకు మంజూరు చేస్తుంది. గ్రూపులు ఏర్పాటు చేసుకున్నప్పటి నుంచి సభ్యులు చేసిన పొదుపు, వారి సీనియారిటీ ఆధారంగా రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇవ్వడం జరుగుతుంది.

మండలంలో మొత్తం 1587 గ్రూపులు..

కల్లూరు మండలంలో మొత్తం 1587 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉన్నాయి. వాటిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 988 గ్రూపులకు రూ.54.18 కోట్ల మేరకు రుణాలు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 325 గ్రూపులకు రూ. 27.60 కోట్ల మేరకు బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇవ్వడం జరిగింది. ఒక్కో గ్రూపులో 10 మంది సభ్యులు ఉండగా.. వారు చేసిన పొదుపును ఆదారంగా రుణాలు ఉంటాయి. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించుకుంటూ పోతే ఈ సారి రుణాన్ని పెంచుతారు. బ్యాంక్ లింకేజ్ ద్వారా రూరల్ ఓట్‌లెట్ పొందిన సభ్యులు తమ జీవనోపాధిని, తమ కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకుంటూ సుస్థిర ఆదాయాన్ని పొందుతున్నారు.

రూ. 3 లక్షలు తీసుకున్నా..



బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ.3 లక్షల రుణం తీసుకున్నాం. కల్లూరులో కిరాణా, జనరల్ స్టోర్ ఏర్పాటు చేసుకుని ఏడాదిన్నర కావస్తుంది. తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తూ జీవనోపాధిని చూసుకుంటున్నా. ప్రస్తుతం బాగానే ఉంది.

– రామిశెట్టి హారిక, కల్లూరు

సక్రమంగా చెల్లించాలి..



బ్యాంక్ లింకేజ్ తీసుకున్న సభ్యులు రుణాలను సక్రమంగా చెల్లించాలి. ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ ఆదాయ వనరులను పెంపొందించుకోవాలి. మంచిగా చెల్లించిన వారికి రుణాలను పెంచి ఇవ్వడం జరుగుతుంది.

– ఎం.వెంకట రామారావు, ఏపీఎం

పోలింగ్ సిబ్బందికి శిక్షణ


శిక్షణ ఇస్తున్న ఎండీ జమీర్

మధిర: నవంబర్ 30న జరగబోయే ఎన్నికలకు సంబంధించి విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎండీ జమీర్ మాట్లాడుతూ.. ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు మాక్ పోలింగ్ నిర్వహించే పద్ధతి, ఫారాలు నింపడం, ఈవీఎం ఆపరేటింగ్, వారిచేత ప్రాక్టీస్ చేయించడం జరిగిందన్నారు. అదేవిధంగా శిక్షణకు హాజరైన సిబ్బందికి పరీక్ష ఏర్పాటు చేయడం జరిగిందని, 80 శాతం కంటే మార్కులు తక్కువగా వస్తే వారికి సెలవు దినాల్లో మళ్లీ శిక్షణ ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. మధిర నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ సిబ్బందికి పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా ఉండాలి..

ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి ఎన్నికల సమయంలో పారదర్శకంగా ఉండాలని అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ తెలిపారు. టీవీఎం పాఠశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి

సత్తుపల్లిటౌన్: ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘం తీసుకొచ్చిన నిబంధనలపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సత్తుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి స్పష్టం చేశారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 313 మంది ఎన్నికల పీఓలు, ఏపీఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేలా తర్ఫీదు పొందాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణా తరగతులను జిల్లా మాస్టర్ ట్రైనర్ శ్రీరాం, జిల్లా ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ విజయనిర్మల సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ యోగీశ్వరరావు, మాస్టర్ ట్రైనర్లు ఎస్.మధుసూదనాచార్యులు, పి.చెన్నకేశవరెడ్డి, ఎ.హరికిరణ్, ఎన్‌సీహెచ్ సుదర్శన్, వి.సత్యం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే మధిర అభివృద్ధి


ప్రచారం నిర్వహిస్తున్న లింగాల కమల్‌రాజ్

మధిర: బీఆర్‌ఎస్ హయాంలోనే మధిర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి,జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. సోమవారం పట్టణంలో మెయిన్ రోడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధిరలో మూడుసార్లు గెలిచిన వ్యక్తి మధిర అభివృద్ధి గురించి మాట్లాడలేదన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని కోరారు. మధిర పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జిల్లా నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ మల్లాది వాసు, సొసైటీ అధ్యక్షులు బిక్కి ప్రసాద్, కరివేద సుధాకర్, భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షులు కనుమూరి వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సాగర్ నీరివ్వాలి

వైరా: సాగర్ జలాలతో వైరా రిజర్వాయర్‌ను నింపి ఎండుతున్న పంటలను కాపాడాలని కోరుతూ.. అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు తహసీల్దార్ కేవీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రెండో విడత సాగర్ జలాలు విడుదల చేయాలన్నారు. వరి పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయని పంటలకు నీరిచ్చి ఆదుకోవాలన్నారు.

ఫాదర్స్ ఫెలోషిప్ మండల నూతన కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల చర్చిల ఫాదర్స్ ఫెలోషిప్ మండల కమిటీని సోమవారం పెగళ్లపాడు గ్రామంలోని క్రీస్తు రక్షణ సంఘం చర్చిలో రెవరెండ్ ఫాదర్ చిట్టిబాబు ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా ఎన్.ఆనందరావు, వైస్ ప్రసిడెంట్‌గా వి.శ్యామ్ సుందర్, సెక్రటరీగా విల్సన్, జాయింట్ సెక్రటరీగా ఆశీర్వాదం, కోశాధికారిగా సురేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘాల అభివృద్ధికి, ఫాదర్ల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు జాన్‌మార్క్, చెన్నయ్య, రామారావు, సరళమ్మ ఉన్నారు.

అరాచకవాదులను ప్రోత్సహించొద్దు..

బోనకల్: అరాచకవాదులను ప్రోత్సహించడం సరికాదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవిందాపురం(ఎల్) గ్రామంలో సర్పంచ్ బాబు, రమేష్‌లు మొదటి నుంచి అరాచకాలకు పాల్పడుతున్నారని, గడినిర్మాణ విషయంలో రాజకీయ రంగు పులిమి గొడవలు సృష్టించి నాగేశ్వరరావుని హత్య చేయడం జరిగిందన్నారు. అలాంటి వారికి భట్టి విక్రమార్క, నందినిలు సపోర్ట్ చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, గుగులోత్ పంతు, కోట కాటయ్య, ఏడునూతల లక్ష్మణరావు, సర్పంచ్ కేతినేని ఇందు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌మేళా

కల్లూరురూరల్: కల్లూరు లయన్స్ క్లబ్ సహకారంతో అర్హులైన దివ్యాంగులకు మంగళవారం కల్లూరు కొత్తబస్‌స్టాండ్‌లో ఉదయం 9గంటలకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తోపాటు ఒక పాస్ పోర్ట్ సైజుఫొటో తీసుకొని రావాలన్నారు. ఈ బస్‌పాస్‌తో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో 50శాతం రాయితీతో ప్రయాణించ వచ్చన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని సొసైటీలో విధులు నిర్వరిస్తూ మృతి చెందిన కర్నుకనాగిరెడ్డి నాగేశ్వరరావుకి సహకారం సంఘం ద్వారా మంజూరైన రూ.5.47 లక్షలు చెక్కును సోమవారం అతని భార్యకు బ్యాంకు మేనేజర్ ముగినం వీరభద్రం, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు అందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రామిశెట్టి ఏసుబాబు, సూపర్‌వైజర్ మహేష్‌బాబు తదతరులు పాల్గొన్నారు.

15వ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్


ఓపెన్‌హౌస్‌లో తుపాకులతో విద్యార్థినులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో పోలీస్ ప్లాగ్‌డే -2023 దినోత్సవాలలో భాగంగా సోమవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో బెటాలియన్‌లోని వివిధ రకాల అత్యాధునిక తుపాకులను స్కూల్ విద్యార్థులు సందర్శనార్థం ఉంచి, వాటి సామర్థ్యాలను, పనితీరును వివరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన బెటాలియన్ కమాండెంట్ పి.వెంకట్‌రాములు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ప్లాగ్‌డే కార్యక్రమాలలో భాగంగా ఈ సారికూడా ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలకు అన్ని రకాల తుపాకులపై అవగాహన కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బెటాలిన్ సహాయ దళాధిపతులు ఆర్.నాగేశ్వరరావు, డీఏవీ స్కూల్, గంగారం హైస్కూల్, విశ్వశాంతి యాజమాన్యం, బెటాలియన్ ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


బోనకల్‌లో ఎలక్షన్ ఫ్లాగ్ నిర్వహిస్తున్న దృశ్యం

బోనకల్: నవంబర్ 30న జరుగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీసీఎస్ ఏసీపీ రవికుమార్ అన్నారు. మండలంలోని బోనకల్, చిరునోముల, చొప్పకట్లపాలెం, ముష్టికుంట్ల గ్రామాలలో 80 మంది పోలీసులతో సోమవారం ఎలక్షన్ ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర సీఐ వసంతకుమార్, బోనకల్, మధిర, ఎర్రుపాలెం ఎస్సైలు సాయికుమార్, సురేష్, రఫీ, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

మన ఓటు.. మన హక్కు

సత్తుపల్లిటౌన్: మన ఓటు.. మన హక్కు అంటూ సత్తుపల్లి డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు గోడలపై వాల్‌రైటింగ్ చేస్తూ.. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. కళాశాల గోడలపై 7వ తరగతి, డిగ్రీ కళశాల, కళాకృతి అకాడమి విద్యార్థులు కలిసి చిత్రలేఖనం ఉపాధ్యాయులు బాలు, ఓలేటి వీనస్ సహకారంతో నా ఓటే నా భవిష్యత్.. నా దేశ పౌరుడిగా నా బాధ్యత అంటూ చేసిన వాల్‌రైటింగ్ చూసిన ప్రజలు వారిని అభినందించారు.

అయ్యప్ప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


హోమ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మహాలక్ష్మి దంపతులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి ఆలయ 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, అయ్యప్పస్వామికి అభిషేక పూజల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మహాలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. మహాపూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా ద్రోణవల్లి మల్లిఖార్జునశర్మ గురుస్వామి, పీవీ శ్రీనివాసరావు శిష్యబృందం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం నాలుగువేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ హైమావతి, శంకర్‌రావు, అర్చకులు వెంకటసురేష్ ఆచార్యులు, ఉప్పల ప్రవీణ్‌కుమార్‌శాస్త్రి, సత్యనారాయణ, బాబీ, సత్యనారాయణ, రాఘవరావు, మధు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు..

కల్లూరురూరల్: కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సోమవారం కల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ.. ఓట్ల కోసం అమలుకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నంవంబర్ 1న జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు అధిక సంఖ్యలో రావాలన్నారు. సభ ప్రారంభానికి ముందు మధుప్రియ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 9న తాను నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామారావు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, రైతు సమితి కన్వీనర్ రఘు, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మదన్‌లాల్

వైరా: మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన 40 కుటుంబాలు సోమవారం వైరాలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. మదన్‌లాల్ వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తలు గడగడపకూ వెళ్లి మేనిఫెస్టో వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, మోహన్ రావు, విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి, డాక్టర్ కాపా మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించండి..

సత్తుపల్లిరూరల్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సత్తుపల్లిటౌన్ అధ్యక్షుడు చిల్లపల్లి మాధవరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్ల బీసీలపై తీవ్ర వివక్షతను చూపిందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఉన్న ప్రతీ బీసీ కుటుంబానికి రూ.లక్ష రుణాలు అందించిన తర్వాతనే బీఆర్‌ఎస్ నాయకులు బీసీలను ఓట్లు అడగాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నియోజకవర్గ గౌరవ సలహాదారులు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు రంగారావు, కార్యదర్శి నాగభూషణం, యువజన సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మారేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఆర్‌ఎస్ ప్రచారం

ముదిగొండ/తల్లాడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముదిగొండ, తల్లాడ మండలాల్లోని పలు గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు, యువసేనా ముమ్మరంగా సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మధిర, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య లను గెలిపించాలన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమాలల్లో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మల్లయ్య, శరత్‌బాబు, వెంకటేశ్వర్లు, రామారావు, గురుమూర్తి, నాగేశ్వరరావు, సుధాకర్, శ్రీకాంత్, వెంకయ్య, పాపారావు, బీఆర్‌ఎస్ యువసేన అధ్యక్షుడు నరేష్‌రాజు, శ్రీనివాసరెడ్డి, శశికుమార్, కృష్ణ, నరసింహారావు, నాగేశ్వరరావు, తాజ్, బాబు, రమేష్, మస్తాన్, మౌలాలీ, ఫకీర్, యాక్సవాలీ, నాగరాజు, ఉపేంద్ర, లాల తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి


వరి పొలాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు రామలింగేశ్వరరావు

పెనుబల్లి: వరిపైరు నష్టపోయిన రైతులకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పంట పొలాలను మండల బీజేపీ అధ్యక్షుడు బొర్రా నరసింహారావుతో కలిసి పరిశీలించారు. ఎన్నెస్పీ కాలువ నీటిని 20 రోజుల ముందు విడుదల చేసి ఉంటే సుమారు 60 వేల ఎకరాల్లో పంట చేతికొచ్చేదని, అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో నాయకుడు మహేష్‌బాబు పాల్గొన్నారు.

మిట్టపల్లిలో ఘనంగా అయ్యప్ప పడిపూజ


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. కర్నాటి ప్రభాకర్ గురుస్వామి ఆధ్వర్యంలో కర్నాటి సిద్దారెడ్డి స్వామి ఇంటి వద్ద కన్నుల పండువగా పడిపూజ నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్పా అంటూ శరణు ఘోష చేశారు. మాలాధారులు కర్నాటి సిద్దారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సరికొండ సాంబశివరావు, గణేశుల రవి, రమేష్, నాగేశ్వరరావు, పుల్లారావు, కన్ని స్వాములు, భవానిలు పాల్గొన్నారు.


పొత్తు కుదరకపోతే సత్తుపల్లి నుంచి పోటీ..

తల్లాడ: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయని, పొత్తు కుదరకపోతే.. సీపీఎం మండల కమిటీ తీర్మాణం మేరకు సత్తుపల్లిలో సీపీఎం నుంచి బరిలోకి దిగుతానని సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచర్ల భారతి అన్నారు. సోమవారం తల్లాడలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడారు. పొత్తు ఉన్నా.. లేకున్నా సీపీఎం శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, అయినాల రామలింగేశ్వరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, శీలం ఫకీరమ్మ, షేక్ మస్తాన్, నన్నేసాహెబ్, కల్యాణపు కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, రాజబోయిన సైదులు, పులి వెంకటనరసయ్య పాల్గొన్నారు.

వైరాలో సీపీఎం సన్నద్ధం

కారేపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పొత్తుపై కాంగ్రెస్ తేల్చకపోవటంతో సీపీఎం స్వతంత్రంగా, వామపక్షాలు, భావ సారూప్యత గల పార్టీల మద్దతుతో వైరాతో పాటు, రాష్ట్రంలోని బలం ఉన్న స్థానాల్లో పోటీకి సన్నద్ధం చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం నాయక్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలం ఎర్రబోడు గ్రామంలో మండల స్థాయి విస్తృత సమావేశాన్ని తలారి దేవ ప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ బన్సిలాల్, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి నరేందర్, నాయకులు రమణ, రామారావు, మంగయ్య, సైదులు, మల్లయ్య, సీతారాములు, ఉమావతి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

6న మధిరలో సీపీఎం నామినేషన్


చింతకాని: మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

మధిర/చింతకాని: అసెంబ్లీ ఎన్నికల్లో మధిర నియోజకవర్గం నుంచి నవంబర్ 6న సీపీఎం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మదా సైదులు తెలిపారు. సోమవారం మధిర, చింతకాని మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజలను మోసం చేస్తున్న పాలక ప్రభుత్వాలను ఓడించడమే సీపీఎం ప్రధాన లక్ష్యమన్నారు. మధిరలో జరిగే నామినేషన్‌కు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ సమావేశాల్లో నాయకులు ప్రభాకర్, వూట్ల శంకర్ రావు, నాయుడు శ్రీరాములు, వడ్రాణపు మధు, సంపసాల గోపాలరావు, కుక్క మోహన్ రావు, కళావతి, వాసు నాయక్, సీపీఎం మధిర డివిజన్ కన్వీనర్ చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి గోపాలరావు, మండల నాయకులు జానికిరాములు, కృష్ణమూర్తి, రాము, రమణ, వీరబాబు, ఉపేందర్, గోపయ్య, కిరణ్ బాబు, సీతారామిరెడ్డి, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

వైరా: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. సోమవారం వైరాలో నిర్వహించిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబార్స్‌మెంట్ రూ.5.135 కోట్లు రావాల్సి ఉందన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోపి, యశ్వంత్, వంశీ, అభి, వీరబాబు పాల్గొన్నారు.

భట్టిని గెలిపించాలి

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మల్లు నందిని అన్నారు. మండలంలోని కాచవరం గ్రామంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతిచెందిన షేక్ లాల్‌మహ్మద్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, నారాయణ, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో పోలీసుల కవాతు

కారేపల్లి: ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని కారేపల్లిలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్సైలు పుష్పాల రామారావు, ప్రవీణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో స్పెషల్ బెటాలియన్ పోలీసులు కారేపల్లిలోని ప్రధాన కూడళ్లలో కవాతు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముదిగొండ: మండలంలోని మాధాపురం, యడవల్లి, మేడేపల్లి, గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ అశోక్ సోమవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో వృద్ధులు, వికలాంగుల వివరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయండి

పెనుబల్లి: దళితుల రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం డిసెంబర్ 4న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు కోరారు. సోమవారం మండలంలోని రామచందర్‌రావు బంజర్‌లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విఠల్ రావు, సత్యం, చిరంజీవి, శ్రీను, వెంకటేశ్వరరావు, మాధవాచారి, సునీత, నాగేశ్వరి, చిల్లుముంత సీతారాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సత్తుపల్లి: పట్టణంలోని గాయత్రి కళాశాలలో సోమవారం లంచగొండి తనంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఏపీజీవీబీ బ్యాంక్ భద్రాచలం రీజియన్ అధికారి బి.నెహ్రూ చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు జి.సుధీర్‌కుమార్, మేనేజర్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం


మున్వర్ హుస్సేన్

సత్తుపల్లి: జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎండీ మున్వర్‌హుస్సేన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ ఎస్‌డీ ముజాహిద్‌హుస్సేన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మహేష్

చింతకాని: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన అబ్బూరి మహేష్ ఎన్నికయ్యారు. హైద్రాబాద్‌లో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు.

ఘనంగా కొమరంభీం వర్ధంతి

కారేపల్లి: కొరంభీం 83వ వర్ధంతిని పురస్కరించుకొని.. కారేపల్లి కొమరంభీం సర్కిల్‌లో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, శివరాం, నాగేశ్వరరావు, రాంప్రసాద్, రాంబాబు, భాస్కర్, శ్రీను, పాండు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.